## క్లుప్తంగా

### పథకాలను వినియోగించుకోవాలి



జిడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రునాయక్ అధ్యక్షత వహించారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మూడోరోజూ విధుల బహిష్కరణ



పాలమూరు: న్యాయవాదులపై జరిగిన దాడులపై దర్యాప్తు జరగాలని, పోలీసులపై కేసు నమోదు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లాలో న్యాయవాదులపై జరిగిన దాడులు నిరసిస్తూ మూడవ రోజు శుక్రవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. చట్టం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, చంద్రమౌళి, ఉమామహేశ్వరి, సబిత సామిల్, జగన్, శివకుమార్ పాల్గొన్నారు.

### పోస్టర్ విడుదల



మహబూబ్‌నగర్ రూరల్: గిరిజన సేవా సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్, గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో.. 17వ ప్రపంచ గిరిజన దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్, డీటీడీఓ ఛత్రునాయక్, నెహ్రూ యువ కేంద్రం అధికారి కొట్యానాయక్, మోహన్‌లాల్, రమేష్‌నాయక్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

జడ్చర్ల: వాట్సాప్ గ్రూప్‌లో కాంగ్రెస్ వారిని కించపరిచే విధంగా పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఓ ఆన్‌లైన్ పత్రిక పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో శుక్రవారం ఓ వ్యక్తి కాంగ్రెస్ ఉన్న వారిని ఉగ్రవాదులుగా పేర్కొంటూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పోస్ట్ పెట్టాడు. దీంతో పాతబజార్‌కు చెందిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విద్యార్థినికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చైతన్యేశ్వరిని తోటి విద్యార్థి తోయడంతో బెంచీకి తగిలి బలమైన గాయాలు అయ్యాయి. దీంతో ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించారు. కాగా తొమ్మిది కుట్లు పడినట్లు విద్యార్థిని తండ్రి రామ్ తెలిపారు. హెచ్‌ఎం ఈశ్వరయ్యను వివరణ కోరగా.. విరామ సమయంలో క్లాస్‌రూం ఆడుకుంటూ విద్యార్థులు తోసుకున్నారని అన్నారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపామని వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జడ్చర్ల: గొల్లపల్లి సమీపంలో 44వ నంబర్ జాతీయరహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కోడ్గల్‌కి చెందిన చెన్నకేశవులు, మల్లెపల్లికి చెందిన లింగంలు బైక్‌పై పోలేపల్లి సెజ్ నుంచి జడ్చర్లకు వస్తుండగా ఎదురుగా కారు ఢీకొట్టింది. బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కానీ బైక్ మాత్రం ఎగిరి డివైడర్ మధ్యలో పడింది. దానిపై ఉన్నవారు గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఎస్వీఎస్‌కు తరలించారు. ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### పెండింగ్ కేసులను పూర్తిచేయాలి : ఎస్పీ

మిడ్జిల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. హైవేల పైన తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగపంచమి



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ అమ్మవారు



జిల్లా కేంద్రం రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో నాగ దేవతలకు పాలుపోస్తున్న మహిళలు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాగ పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నాగ దేవతకు పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది. పిల్లలమర్రి రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించారు.

■ జడ్చర్లలోని చైతన్యనగర్ బంగారుమైసమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి మొక్కి కొందరు మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. పట్టణంలోని భాగ్యేశ్వరాలయం, రేణుకాఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

■ భూత్పూర్ మున్సిపాలిటీ, దేవరకద్ర, నవాబుపేట, చిన్నచింతకుంట మండల కేంద్రాలు, గ్రామాల్లో మహిళలు తమ పిల్లలతో వచ్చి నాగదేవతలకు పాలు పోసి పూజలు చేశారు.



వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



నవాబుపేటలో..



దేవరకద్ర వాసవీమాత ఆలయంలో..



బాదేపల్లి బంగారుమైసమ్మ ఆలయంలో..

### యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విభాగాన్ని మరింతగా పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహానికి వినతి అందజేత



జడ్చర్ల టౌన్: అధికారులు, పాలకుల కళ్లు తెరిపించి తమ కష్టాలను దూరం చేసేలా చేయండి అంటూ.. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి పి. సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్ తదితరులు జడ్చర్ల మున్సిపాలిటీ కార్మికుల ఆందోళనలో భాగంగా 5వరోజు కార్యక్రమంలో మాట్లాడారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు హరించుకుపోతున్నాయని వాపోయారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సిములు, కార్మికులు మహేష్, కేశవులు, కృష్ణ, దేవమ్మ, అంజమ్మ, యాదమ్మ, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

### ల్యాప్‌టాప్ వితరణ

చిన్నచింతకుంట: మద్దూర్‌కి చెందిన విద్యార్థిని రితిక హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఆమెకు ఉన్నత చదువుల నిమిత్తం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శుక్రవారం దమగ్నాపూరంలో ల్యాప్‌టాప్ అందజేశారు. గోవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం

పాలమూరు: సినీహీరో మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా.. శుక్రవారం మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల తలసేమియా పిల్లలతో పాటు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించిన వాళ్లం అవుతామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ పాల్గొన్నారు.

### ఎస్‌ఐగా భాస్కర్‌రెడ్డి

కోయిల్‌కొండ: మండల ఎస్‌ఐగా భాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇదివరకు విధులు నిర్వహించిన శ్రీకాంత్‌రెడ్డి గద్వాల్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పోలీసులకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

### దీక్షకు తరలిరండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీసీల కోసం శనివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సత్యాగ్రహ దీక్షకు జిల్లా నుంచి స్వచ్ఛందంగా తరలిరావాలని జేఏసీ జిల్లా నాయకులు బోయిని చెన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణన, బీసీలకు జరుగుతున్న అన్యాయం తదితరాలపై నినదించాల్సిన ఐక్యంగా అవసరముందన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: జిల్లాలో ఈనెల 11, 12తేదీల్లో మండలాలు, 13న జిల్లా కేంద్రాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో తీరంగా యాత్ర నిర్వహించాలని.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ కుండే మాట్లాడారు. పెద్దసంఖ్యలో యాత్రలు, కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 14న మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శివకృష్ణ, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. భారతీయ జనతా యువ మోర్చా పట్టణ నూతన అధ్యక్షుడిగా శివకృష్ణను నియమించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రం అందించారు.

## ముగిసిన ‘స్వచ్ఛదనం- పచ్చదనం’



మల్లెబోయిన్‌పల్లిలో మొక్కల పంపిణీ



మంగళిగడ్డ తండాలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

సాక్షినెట్‌వర్క్: జిల్లా కేంద్రంలో ‘స్వచ్ఛదనం-పచ్చదనం’లో భాగంగా చివరిరోజు శుక్రవారం ఆయా వార్డుల్లో మొక్కలు విరివిగా నాటారు. మరోవైపు డ్రై డే సైతం నిర్వహించారు. మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వేశారు.

■ మిడ్జిల్ పరిధిలోని మంగళిగడ్డ తండాలో శుక్రవారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పర్యటించారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంను, పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీశ్వర్, వైద్యాధికారి శివకాంత్ ఉన్నారు.

■ నవాబుపేటలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఎంపీడీఓ జయరాంనాయక్, తహసీల్దార్ నాన్యనాయక్, ఈఓపీఆర్డీ బద్రునాయక్, ఏపీఓజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్లలో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ సరోజ, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ రాజాపూర్‌లో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, డాక్టర్ అరుణ, నాయకులు పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్‌లో అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్‌హైమద్, డీఆర్‌ఓ తాజోద్దీన్, సెక్షన్ అధికారులు సురేందర్, శ్రీనివాస్, బీట్ అధికారులు హఫీజ్, ఆంజనేయులు, స్వాతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

■ చిన్నచింతకుంటలో వాటర్ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ నాగరాజు పరిశీలించారు.

■ గండీడ్‌లో ఎంపీడీఓ దేవన్న, పీసీసీ మెంబర్ నరసింహారావు, ఎంపిఈఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు. దేవరకద్రలో డ్రైడే నిర్వహించారు.

## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనం, న్యూట్రీగార్డెన్స్ అనే అంశంపై వ్యాసరచన పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ విజయేందిర ప్రశంసాపత్రాలను శుక్రవారం అందజేశారు. అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈఓ రవీందర్, దుంకుడు శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: వ్యాసరచన పోటీల్లో మిడ్జిల్ పరిధిలోని అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల మొదటి స్థానంలో నిలవగా కలెక్టర్ విజయేందిర చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు.

### మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

నవాబుపేట: మహిళలు మరింతగా ఆర్థిక అభివృద్ధి సాధించాలనే.. మహిళ శక్తి పథకంలో కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఓ నర్సింహులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో సీతాఫల్ తదితర యూనిట్లు రావటం చైతన్యానికి నిదర్శనమన్నారు. ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఎం జీవరత్నం, ఎంఎంఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, యశోద, సీసీలు కాంచన, రమాదేవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కప్పెటలో పూజలు చేస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: కప్పెటలో ఆంజనేయస్వామి, బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**నాభిశిల పునఃప్రతిష్ఠ**

మహబూబ్‌నగర్ రూరల్: బొక్కలోనిపల్లిలో శుక్రవారం పోచమ్మ, నాగులు, బలిపీఠం, పోతురాజు, నాభిశిల (బొడ్రాయి) పునఃప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు రావుల యుగంధర్‌రెడ్డి, మణికొండ అశోక్‌యాదవ్, మారుతిగౌడ్, చెన్నయ్యయాదవ్, తిరుపతయ్యయాదవ్ పాల్గొన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులపై వివరణ ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్..



అసంపూర్తిగా సబ్‌సెంటర్

‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్ధాయిపల్లి వద్ద నిర్మిస్తున్న సబ్‌సెంటర్ పనులపై రాత పూర్వక వివరణ అందజేయాలని పంచాయత్ రాజ్ అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. గత నెల 30న అసంపూర్తిగా సబ్‌సెంటర్ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. కాగా ఈ నెల 2న జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ నరేందర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి మహబూబ్‌నగర్ ఆదేశానుసారంగా ఎన్‌హెచ్‌ఎం నిధుల ద్వారా రూ.20లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ చేసిన పనులకు గాను బిల్లులు చెల్లించాల్సి ఉండగా చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారని తెలిసింది. కాగా కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని పీఆర్‌ఈఈ రాత పూర్వకంగా కోరారు.

### నేడు పద్యనాటక ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీమిత్ర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు.. మండలి అధ్యక్ష, కార్యదర్శులు వి.మనోహర్‌రెడ్డి, నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వారిచే భీష్మ పౌరాణిక నాటకం, మిత్ర కళానాట్య మండలి, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వారిచే మయసభ దుర్యోధన, శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. అదే విధంగా కళారంగాల్లో విశేష సేవలు అందిస్తున్న దాదాపు 100 మందిని ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

### దివ్యాంగుల సంక్షేమానికి కృషి

జడ్చర్ల: దివ్యాంగుల సంక్షేమానికి తమ సంస్థ కృషి చేస్తుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు అరుణ్‌ప్రసాద్‌రెడ్డి, లక్ష్మి, గురుదేవి, గౌరీ పాల్గొన్నారు.

### రోడ్డు వేయాలని వినతి

దేవరకద్ర: అడవి అజిలాపూర్ సమీపంలోని ఉద్దండ రామస్వామి గుట్ట పక్క నుంచి రోడ్డు వేయాలని గ్రామ నాయకులు, రైతులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి సమస్యను వివరించగా.. త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చిన్నయ్య, గోపాల్, రాజుగౌడ్, రాజేశ్, భాస్కర్, రఘు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

### బాధితులను ఆదుకుందాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వయనాడ్ బాధితులను ఆదుకుందామని నాయకులు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిధి సేకరణ చేపట్టారు. జిల్లా కోశాధికారి చంద్రకాంత్, టౌన్ కన్వీనర్ రాజ్‌కుమార్, మహేష్, రాజు, సతీశ్, చిన్న కేశన్న పాల్గొన్నారు.

### మగ్గం డిజైన్‌పై శిక్షణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో శుక్రవారం జనతా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం డిజైన్‌పై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 45 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని నిర్వాహకుడు జహంగీర్‌పాష వెల్లడించారు. వాల్మీకి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బాలస్వామి పాల్గొన్నారు.

### సంతకాల సేకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంతకాల సేకరణ చేపట్టారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సయ్యద్ సమీర్ అహ్మద్ తదితరులు సైతం సంతకాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టి వాటిని వివిధ పార్టీలకు పంపనున్నట్లు వివరించారు. చీఫ్ ప్యాట్రన్ ఖాజ ఫయాజుద్దీన్ అన్వర్‌పాష, కన్వీనర్ తఖీ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

### వాసవీమాతకు పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేశారు. సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం, పల్లకీసేవ చేపట్టారు. దేవరకద్ర శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయాల్లో శుక్రవారం అఖండ దీపారాధన కొనసాగింది.

### లోక కల్యాణార్థం యజ్ఞం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్యసమాజం దయానంద విద్యామందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్రిదివసీయ శ్రావణి యజ్ఞం శుక్రవారం ప్రారంభమైంది. ఆర్య ప్రతినిధి సభ ఉపాధ్యక్షుడు బి.శివకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కామారెడ్డి గురుకులం వేదమిత్ర మహాపండితులు బ్రహ్మానంద సరస్వతి మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం చేపట్టారు. లోక కల్యాణార్థం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

### హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌పల్లి (వార్డు నం.10) లోని క్రీస్తుజ్యోతి దేవాలయం, శ్మశానవాటికలలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

### ఇబ్బందులు కలిగించరాదు



భూత్పూర్: ప్రభుత్వం రుణమాఫీ కల్పించిన రైతులకు బ్యాంకు అధికారులు ఇబ్బందులు కల్గించరాదని.. త్వరగా రుణమాఫీ సొమ్మును రైతులకు అందించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏపీజీవీబీ బ్యాంకుకు వెళ్లి రుణమాఫీపై వివరాలు తెలుసుకున్నారు. కర్వెనకి చెందిన జి. అశోక్‌రెడ్డి రూ. లక్షన్నర రుణం తీసుకోగా కేవలం రూ. లక్షలోపు మాఫీ కావడంతో ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాగా రైతులతో అధికారులు చులకగా వ్యవహరించరాదని ఎమ్మెల్యే సూచించారు.

### క్విట్ ఇండియా దినోత్సవం

జడ్చర్ల టౌన్: బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సుకన్య పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు. అధ్యాపకులు డా. పావని, నాగరాజు, నందకిశోర్, నరసింహ్మ పాల్గొన్నారు.

### పీజీ ప్రవేశ పరీక్షలో సత్తా

జడ్చర్ల టౌన్: బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వరలక్ష్మి ఉస్మానియా పీజీ ప్రవేశ పరీక్ష వృక్షశాస్త్ర విభాగంలో 54వ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డా. సుకన్య తెలిపారు. అదేవిధంగా హౌజింగ్‌బోర్డు కాలనీలో ఉంటున్న ఆసిఫ్ ఎంఏ హిందీ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయి 13వ ర్యాంక్ సాధించినట్లు వివరించారు.